సాగునీటి సంగ్రామం ఖరారు

- 14న ఎన్నికలు
- నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు
- ఓటర్ల జాబితా సిద్ధం

బలిజిపేట: జిల్లాలోని సాగునీటి సంఘాల ఎన్నిలకు నగారా మోగింది. ఈ నెల 14న జరగనున్న ఈ ఎన్నికల కోసం ఇరిగేషన్ అధికారులు ఎన్నికల ఏర్పాట్లు చేస్తున్నారు. బలిజిపేట మండలంలో మీడియం ఇరిగేషన్‌కు సంబంధించి 4సాగునీటి సంఘాలు, మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి 12సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. మీడియం ఇరిగేషన్‌లో పెదంకలాం కాలువకు అరసాడ, నారాయణపురం, పలగర, పెదపెంకి నీటి సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘానికి 12మంది టీసీలు ఉంటారు. మొత్తం 48మంది టీసీల ఎన్నికకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి 12సంఘాలు ఉన్నాయి. వాటిలో ఒక్కో సంఘానికి అరుగురు టీసీల చొప్పున 72మంది ఉంటారు. మీడియం, మైనర్ ఇరిగేషన్లకు సంబంధించి 120మంది టీసీలకు కలిపి 10,132మంది ఓటర్లు ఉన్నారు. మీడియం ఇరిగేషన్‌లో పెదంకలాం కాలువ పరిధిలో అరసాడ సంఘంలో అరసాడ 6టీసీలు, పదమాయవలస 5టీసీలు, చెల్లెంపేట ఒక టీసీకి 1,412మంది ఓటర్లు ఉన్నారు. నారాయణపురం సంఘానికి సంబంధించి 12టీసీలలో ఒకటి వెంగాపురం, నారాయణపురం 11, ఇక్కడ 1,316మంది ఓటర్లు ఉన్నారు. పలగర నీటి సంఘానికి సంబంధించి పలగర 6, చిలకలపల్లి 6 టీసీలకు 1,195మంది ఓటర్లు ఉన్నారు. పెదపెంకి సాగునీటి సంఘానికి సంబంధించి 12టీసీలలో నారింపేట ఒకటి, తుమరాడ ఒకటి, పెదపెంకి 9, కూర్మనాథపురం ఒక టీసీకి గాను 1,573మంది ఓటర్లు ఉన్నారు. ఇక మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి ఒక సంఘానికి 6గురు టీసీల వంతున ఉంటారు. వాటిలో అజ్జాడ చింతల చెరువుకు 364మంది ఓటర్లు, సూరపునాయుడు చెరువుకు 129మంది ఓటర్లు, అంపావల్లి రాజు చెరువుకు 383మంది ఓటర్లు, తమికినాయుడు చెరువుకు 269మంది ఓటర్లు, అరసాడ జంగంనాయుడు చెరువుకు 845మంది ఓటర్లు, బర్లి తామర చెరువుకు 6టీసీలలో ఒకటి మిర్తివలస, బర్లి 5టీసీలకు సంబంధించి 526మంది ఓటర్లు, గలావల్లి తామర చెరువుకు సంబంధించి 574మంది ఓటర్లు, గంగాడ సిమ్మినాయుడు చెరువుకు 179మంది, హసన్‌ఖాన్ చెరువుకు 311మంది ఓటర్లు, వల్లభనాయుడు చెరువుకు 240మంది, తుమరాడ రాజు చెరువుకు సంబంధించి 224మంది, వంతరాం కుక్కుటిపూను చానెల్‌కు సంబంధించి 592మంది ఓటర్లు ఉన్నారు.


పెదంకలాం కాలువ


తుమరాడ రాజుచెరువు

నియమావళి ప్రకారం ఎన్నిక

ఎన్నికలు ప్రధాన కేంద్రాలలో నిర్వహించనున్నారు. ఎన్నికలకు గంటముందు అక్కడికి వెళ్లి ఏర్పాట్లు చేయనున్నాం. ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నిక నిర్వహిస్తాం. ఏకగ్రీవం కాని వాటికి సీక్రెట్ ఓటింగ్ చేపట్టనున్నాం. మొత్తం 16చోట్ల ఎన్నికలు నిర్వహిస్తాం.

కవిత, ఇరిగేషన్ ఏఈ, బలిజిపేట

సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

సీతానగరం: మండలంలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల నోటిఫికేషన్ పత్రాలను బుధవారం తహసీల్దార్ కార్యాలయం నోటీసు బోర్డులో ఇరిగేషన్ ఏఈ ఎ.శ్రీనివాసరావు, తహసీల్దార్ కార్యాలయం సీనియర్ సహాయకుడు సన్యాసిరావు వేలాడదీశారు. ఈ మేరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన అనంతరం ఆయన మాట్లాడుతూ నీటి పారుదల వ్యవస్థలో అసాధారణ సర్వసభ్య మండలి పాలకవర్గ ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వ జలవనరుల శాఖ మార్గదర్శకాలు విడుదల చేసిందని, ఈ నేపథ్యంలో అన్ని నీటిపారుదల సంఘాల్లో ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 14న ఉదయం 8 గంటలకు సభ్యులందరితో సమావేశం, 9 గంటలకు ఎన్నికల విధివిధానాలు తెలియజేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.


సీతానగరం: తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ వేలాడదీస్తున్న ఏఈ శ్రీనివాసరావు సీనియర్ సహాయకుడు సన్యాసిరావు

పాఠశాలా..? చెరశాలా..?

- నారాయణ స్కూల్ ఉపాధ్యాయులపై తల్లిదండ్రుల మండిపాటు
- తమ పిల్లలను కొట్టడంపై నిలదీత

పార్వతీపురంటౌన్:

పార్వతీపురం జిల్లా కేంద్రంలో దశాబ్దాలుగా విద్యాబోధన అందిస్తున్న నారాయణ స్కూల్ ఉపాధ్యాయులు కొందరు అక్కడ చదువుకుంటున్న పదోతరగతి విద్యార్థులను ప్లాస్టిక్ పైపులతో ఇష్టారాజ్యంగా కొట్టి ఎందుకు విరుచుకుపడ్డారంటూ, విద్యార్థుల తల్లిదండ్రులు నారాయణ స్కూల్ ఉపాధ్యాయులను బుధవారం నిలదీశారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పదో తరగతి చదువుతున్న తమ బిడ్డలు పది రోజుల క్రితం తెలిసీతెలియని పరిస్థితుల్లో ఒకరితో ఒకరు చిన్న గొడవ పడ్డారని, ఆ విషయానికి సంబంధించి స్కూల్ ఉపాధ్యాయులు మందలించారని చెప్పారు.

అయితే అక్కడితో ఆ విషయాన్ని విడిచిపెట్టకుండా పాఠశాల నిర్వహణ ఉద్యోగుల్లో ఒకరు నాలుగు రోజుల క్రితం ఇదే విషయాన్ని మళ్లీ ప్రస్తావించి, ప్లాస్టిక్ పైపులతో తరగతి గదిలో సీసీ కెమెరాల సాక్షిగా, వాతలు తేరేలా తమ బిడ్డలను కొట్టారని, తల్లిదండ్రులకు చెబితే పాఠశాల నుంచి తరిమేస్తామని బెదిరించారన్నారు. తమ బిడ్డలపై తామే చేయి చేసుకోమని అలాంటిది ప్లాస్టిక్ పైపులతో విచక్షణ మరిచి ఉపాధ్యాయులు దాడి చేయడం చాలా బాధాకర విషయమన్నారు. నారాయణ స్కూల్ అంటే ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ ఇలా ఉపాధ్యాయుల దాడులు మంచిది కాదని, తమ బిడ్డలను దారుణంగా కొట్టిన వారిపై యాజమాన్యం చర్యలు తీసుకోకపోతే? చట్టపరమైన చర్యలకు ముందుకు వెళ్తామని విద్యార్థులు తల్లిదండ్రులు స్పష్టం చేశారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దుచేయాలి

- యూటీఎఫ్ డిమాండ్

పార్వతీపురంటౌన్:

టీడబ్ల్యూ రెసిడెన్షియల్ టీచర్ల సమ్మె సందర్భంగా, టీడబ్ల్యూ ఆశ్రమ హైస్కూల్ టీచర్లను ఇతర జిల్లాలకు డిప్యుటేషన్లు వేయడం దుర్మార్గమని దీన్ని వెంటనే రద్దు చేయకపోతే పోరాటం చేస్తామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మురళీమోహన్‌రావు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టీడబ్ల్యూ ఆశ్రమ స్కూల్స్‌లో సబ్జెక్టు టీచర్లు ఒక్కొక్కరు పనిచేస్తున్నప్పటికీ డిప్యూటేషన్లపై వేస్తే ఆ పాఠశాలల్లో ఎవరు పాఠాలు చెబుతారని, ఆ విద్యార్థుల భవిష్యత్ ఏమిటని ప్రశ్నించారు. పక్షవాతంతో ఆరోగ్యసమస్యలతో బాధపడుతున్నప్పటికీ డిప్యూటేషన్లు వేయడం దారుణమన్నారు. సమ్మె సమస్యను పరిష్కరించాలి తప్ప ఉపాధ్యాయుల హక్కులను కాలరాయడం సరికాదన్నారు. రేపటిలోగా డిప్యూటేషన్లు రద్దు చేయకపోతే ఐటీడీఏ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

హీమోగ్లోబిన్ పరికరాన్ని వినియోగించే విధానంపై శిక్షణ


శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: హీమోగ్లోబిన్ పరికరాన్ని వినియోగించే విధానంపై రీ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని వైద్య సిబ్బందికి జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహన్‌రావు ఈ మేరకు వైద్యబృందంతో బుధవారం శిక్షణలో పాల్గొని పలు సూచనలు చేశారు. రిగ్ నానో సిస్టం ఇండియా (ప్రై.లి) నుంచి టెక్నికల్ ఇంజినీర్స్ డి.దుర్గాప్రసాద్, ఎస్.ఇమ్రాన్ శిక్షణ ఇచ్చారు.దీర్ఘకాలికంగా ఉపయోగించడం, సరైన క్రమ పద్ధతుల్లో వినియోగించకపోవడం వల్ల గానీ, హీమోగ్లోబిన్ పరికరంలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తవచ్చని, అవి పునరావృతం కాకుండా ఉండాలంటే ట్రూ హెచ్‌బీ పరికరం ఉపయోగించే పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్ఓ ఉషారాణి, డీపీఓ లీలారాణి, డీఎస్ఓ శంకర్, ఏఎన్ఎం, సీహెచ్ఓ(ఎంఎల్‌హెచ్‌పీ)లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

- పీజీఆర్ఎస్ నోడల్ అధికారి బి.రామ్‌గోపాల్

సాలూరు: ప్రజాసమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని పీజీఆర్ఎస్ (ప్రజాసమస్యల పరిష్కార వేదిక), జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా నోడల్ అధికారి బి.రామ్‌గోపాల్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన సాలూరు పట్టణం, పాచిపెంట మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, సచివాలయాలను పరిశీలించారు.ఈ సందర్భంగా సాలూరు తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ, పీజీఆర్ఎస్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంపై జిల్లా, రాష్ట్రస్థాయి అధికారుల పర్యవేక్షణ ఉందని వివరించారు.అధికంగా భూ సంబంధిత అర్జీలు వస్తున్నాయని తెలిపారు. అర్జీలను సక్రమంగా పరిష్కరించాలని పునరుద్ఘాటించారు. ఈ క్రమంలో పాచిపెంట మండలంలో పాచిపెంట-1,2, పి.కోనవలస, కర్రివలస, పణుకువలస, సాలూరు పట్టణంలోని పలు సచివాలయాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, ప్రస్తుతం జరుగుతున్న సర్వేల ప్రగతి తదితర అంశాలపై ఆరా తీశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు విధిగా ఆన్‌లైన్‌లో అటెండన్స్ వేయాలని, అటెండన్స్ ఆధారంగా జీతాల చెల్లింపు చేయాలని జీఎస్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయన్న విషయాన్ని అందరు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా సమన్వయకర్త వి.చిట్టిబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి బి.రామ్‌గోపాల్

టీకాలు వేయడంలో జాప్యం కూడదు

పార్వతీపురంటౌన్: టీకాలు వేయడంలో జాప్యం ఉండకూడదని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు స్పష్టం చేశారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని చొక్కాపువానివలస గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వ్యాధినిరోధక టీకాలు షెడ్యూల్ ప్రకారం సకాలంలో వేస్తున్నారా? లేదా అని తెలుసుకునేందుకు ఆర్సీహెచ్ రికార్డులు పరిశీలించారు.

టీకా సెషన్ ప్రారంభించిన సమయాన్ని యువిన్ పోర్టల్‌లో తనిఖీ చేశారు. తేదీల ప్రకారం టీకా తప్పనిసరి అని ఆదేశించారు. ఒక వేళ పిల్లలు అప్పుడప్పుడు వేరే ఊళ్లకు వెళ్లినప్పటికీ అక్కడ వైద్య సిబ్బందితో టీకాలు వేయించుకునేలా, వారితో పాటు టీకా కార్డులను తీసుకు వెళ్లాలని తల్లిదండ్రులకు తెలియజేయజేసి వివరించాలని చెప్పారు. అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేసి పిల్లల బరువు, ఎదుగుదల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం గర్భిణి గృహ సందర్శన చేసి ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంసీపీ కార్డు పరిశీలించి పూర్తి వివరాలు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో జ్వర లక్షణాలతో ఎవరైనా ఉన్నారా? అని సిబ్బందిని అడిగారు. కార్యక్రమంలో డెమో యోగీశ్వరరెడ్డి, ఏఎన్ఎం ఉష, అంగన్వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్త ఉన్నారు.


టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

ఐసీడీఎస్ పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సీతానగరం: గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంతో ప్రీస్కూల్ పిల్లలు, బాలింతలు, గర్భిణులకు సంపూర్ణమైన ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పూర్ణిమ అన్నారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు ఆధ్వర్యంలో రెండవ రోజు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై శిక్షణ తరగతులు జరిగాయి. ఈ తరగతుల్లో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పూర్ణిమ మాట్లాడుతూ వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రజలకు ఆరోగ్యవంతమైన పనులు చేపట్టడం వల్ల బహుళ ప్రయోజనాలున్నాయని తెలియజేశారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపనకు ఎంపీడీఓ త్రివిక్రమరావు పర్యవేక్షణలో అన్ని శాఖల అదికారులు సమష్టిగా సేవలందించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వెలుగు ఏపీఎం ఆర్ శ్రీరాములు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడానికి వివిధ రకాలుగా రుణాలు సమకూరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్. రామారావు, పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎస్వీ రమణ, ఎంఈఓ-2 ఎం. వెంకటరమణ పాల్గొన్నారు.


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పూర్ణిమ

సోలార్ వినియోగంతో విద్యుత్ ఆదా

మక్కువ: సోలార్ వినియోగంతో విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చునని విద్యుత్‌శాఖ ఏడీఏ వి.రంగరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో బుధవారం పీఎం సూర్యఘర్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఏఈ జోగినాయుడు ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హజరైన డీఈ రంగరావు మాట్లాడుతూ సోలార్ రూఫ్ ట్యాప్‌లను గృహాలపై ఏర్పాటుచేసుకోవడం వల్ల విద్యుత్ వాడకాన్ని ఆదా చేసుకోవడంతోపాటు, విద్యుత్‌చార్జీలు తగ్గించుకోవచ్చన్నారు. విద్యుత్ వినియోగం పెరగడంతో, సోలార్ రూఫ్‌ట్యాప్‌ల వల్ల విద్యుత్ వినియోగం తగ్గుతుందన్నారు. ప్రజలకు సోలార్ వినియోగంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయుకుడు మావుడి ప్రసాదరావు నాయుడు, విద్యుత్‌శాఖ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏడీఏ రంగారావు

సీతానగరం విద్యార్థినికి ప్రశంసలు

సీతానగరం: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థినికి పోలీస్ శాఖ బుధవారం ప్రశంసాపత్రం బహూకరించింది. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో 'పాఠశాల స్థాయిలో సైబర్ నేరాలు, డ్రగ్స్ వాడకాన్ని ఏ విధంగా నిరోధించాలి' అన్న అంశంపై నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో సీతానగరం ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థిని బంక శ్రావణి ప్రథమ స్థానం సాధించింది.ఈ మేరకు వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన శ్రావణికి జిల్లా అదనపు ఎస్పీ దిలీప్‌కుమార్ ప్రథమ బహుమతిని అందజేశారు. ప్రథమ బహుబమతి సాధించిన శ్రావణిని హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి, ఎస్ఎంసీ కమిటీ ఛైర్మన్ పలగర శ్రీదేవి ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, డి.రామారావు, ఎస్సై ఎం.రాజేష్ అభినందించారు.

వ్యాసరచన పోటీ గురుకుల విద్యార్థి ప్రతిభ

సాలూరు: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాచిపెంట మండలంలోని పి.కోనవలస గిరిజన గురుకుల కళాశాల విద్యార్థి ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ వీఏ మహేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ, గత నెలలో సైబర్ క్రైమ్ నిర్మూలనలో యువత పాత్ర అనే అంశంపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు జరగ్గా ఇంటర్మీడియట్‌ద్వితీయ సంవత్సరం చదువుతున్న బి.రాకేష్ జిల్లాస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచాడని తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని ఏఎస్పీ దిలీప్ కిరణ్ అభినందించారని చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థికి కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.


విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న జిల్లా అదనపు ఎస్పీ దిలీప్‌కుమార్


విద్యార్థిని అభినందిస్తున్న ఏఎస్పీ దిలీప్ కిరణ్

దళారులవే ధాన్యం..

- నామమాత్రంగా మారిన రైతుసేవా కేంద్రాలు
- బస్తాకు రూ. 1700 చెల్లిస్తున్న దళారీలు
- రైతుసేవా కేంద్రం ద్వారా వెళితే నాలుగు కిలోలు అదనం
- ఇంతవరకు కొనుగోలు చేసింది 1830 టన్నులే


దళారులు కొనుగోలు చేసిన ధాన్యం

పాలకొండ: ధాన్యం కొనుగోలుకు సంబంధించి కూటమి ప్రభుత్వం చర్యలతో రైతులు అవస్థలు పడుతున్నారు. రైతుసేవా కేంద్రాలు నామమాత్రంగా మారడంతో దళారీలు ధాన్యం వారికి ఇష్టం వచ్చిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. పొరపాటున రైతులు కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం అమ్మితే రైస్ మిల్లర్లు 80 కిలోల బస్తాకు అదనంగా నాలుగు కిలోలు తీసుకుంటున్నారు. మండల వ్యాప్తంగా ప్రస్తుతం వరి నూర్పులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 40 శాతం మేర నూర్పులు పూర్తయినా.. కొనుగోలు కేంద్రాల ద్వారా కనీసం 20 శాతం ధాన్యం కొనుగోళ్లు జరగలేదు. ఇప్పటివరకు కేవలం 1830 టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. తేమశాతం లెక్కింపు, అదనంగా ధాన్యం ఇవ్వాల్సి రావడం, మరో తుఫాన్ ఉందన్న వార్తల నేపథ్యంలో ధాన్యం విక్రయాలకు రైతులు తొందరపడుతున్నారు.

84 కిలోలు .. రూ. 1700

ప్రస్తుతం దళారీలు రైతుల నుంచి ధాన్యం రూ. 1700 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఇందులో కూడా 84 కిలోల చొప్పున తూకం వేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ఇప్పటికే సగం మంది రైతులు దళారీలకు ధాన్యం విక్రయించారు. దళారీలు రైతుల నుంచి పాస్ పుస్తకాలు తీసుకుని నేరుగా మిల్లర్లతో జతకట్టి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

మిల్లర్లు ససేమిరా..

కొనుగోలు కేంద్రం నిబంధనలు చూసి రైతులు భయపడుతున్నారు. ముందుగా కొనుగోలు కేంద్రంలో నాణ్యత పరిశీలించిన తర్వాత మిల్లర్ల దగ్గరకు వెళ్లి ధాన్యం ధర మాట్లాడుకోవాల్సి వస్తుంది. ఇందులోనూ 84 కిలోలు చెల్లిస్తేనే మిల్లర్లు ముందుకు వస్తున్నారు. ఆ ధాన్యం కొనుగోలు కేంద్రంలో మినహాయించి ట్రక్‌షీట్ జనరేట్ చేస్తున్నారు. దళారీలు కూడా నాలుగు కిలోలు అదనంగా తీసుకుంటున్నారు. ఇవన్నీ పరిశీలిస్తే దళారీలే బెటరన్న ఆలోచనలో రైతులు వారికే ధాన్యం విక్రయిస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా కృష్ణ జయంతి


పూజలు చేస్తున్న శ్రీనివాసరావు

సీతానగరం: శ్రీకృష్ణ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సీతానగరం మండలంలోని బూర్జ కృష్ణమందిరంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రొంగలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ నిడగల్లు, బెలగాం, కృష్ణారాయపురం, వెంకటాపురం,తదితర గ్రామాల నుంచి వచ్చిన 18 అధ్యాయాల గీతా పారాయణం, తత్సంగ ప్రవచన కార్యక్రమం, భజనకార్యక్రమాలు, తీర్థ ప్రసాదాల వితరణ జరిగాయని చెప్పారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు జి. సింహాచలం, టి.తిరుపతిరావు, ఇ గుంపస్వామి, జక్కు కృష్ణమూర్తి, ఎం. సింహాచలం పాల్గొన్నారు.


గీతాపారాయణం చేస్తున్న భక్తులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని నర్సిపురం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం 11కేవీ బందలుప్పి ఫీడర్ ట్రీ కటింగ్ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.గోపాలరావు నాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. పెదబొండపల్లి, సుడిగాం, కారడవలస గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీటీరోడ్డు మరమ్మతులకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

సీతానగరం: మండలకేంద్రంలో గోతులవారిన బీటీ రోడ్డు మరమ్మతు పనులకు ఎమ్మెల్యే బి.విజయచంద్ర బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడెం వీధి జంక్షన్ నుంచి మార్కెట్ మీదుగా పెదభోగిలి పాత పంచాయతీ కార్యాలయం వరకూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్డు గోతులు వారడం వల్ల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక నాయకులు ఫిర్యాదు చేయడంతో రూ. 60 లక్షలతో రోడ్డు మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. అలాగే గ్రామాల్లో ప్రారంభించిన అభివృద్ధి పనులను నిర్వాహకులు వేగవంతం చేసి, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.కార్యక్రమంలో తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ త్రివిక్రమరావు, ఇంజినీరింగ్ అదికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రూపేష్

పార్వతీపురంటౌన్: గ్రామపంచాయతీలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రూపేష్ కుమార్ కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగస్తులకు రెండు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే గ్రామపంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే కాకుండా సమస్యలు లేని గ్రామాలుగా తయారు చేయలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చే వినతులపై ప్రతి ఒక్కరూ సత్వరమే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జట్టు ఆశ్రమ నిర్వాహకురాలు పద్మజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.